క్లుప్తంగా

కందుల కొనుగోలు ప్రారంభం



కందులు తూకాలు వేస్తున్న దృశ్యం

కూడేరు: మండల కేంద్రంలోని వ్యవసాయ గోదాములో లక్ష్మీనరసింహ మ్యాక్స్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వం తరఫున కందులు కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. గొటుకూరు, బ్రాహ్మణపల్లితో పాటు మరికొన్ని గ్రామాల రైతులు కందులు విక్రయించేందుకు వచ్చారు. కందులు క్వింటా రూ.7,550లతో కొనుగోలు చేస్తున్నట్లు సొసైటీ ప్రతినిధి మనోహర్ రెడ్డి తెలిపారు. రవాణా ఖర్చులు, హమాలీల ఖర్చులు, కందులు జల్లెడి పట్టడానికి అయ్యే ఖర్చులను రైతులే భరించాలన్నారు. తొలి రోజు 80 క్వింటాళ్ల కందులు కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు పాత సామాన్లు వేలం

బొమ్మనహాళ్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పాత సామాన్లకు శనివారం ఉదయం 9 గంటలకు వేలం వేయనున్నట్లు వైద్యాధికారిణి శ్రీలక్ష్మీ ఓ ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రిలో పాతగా ఉన్న టేబుల్, రెండు ఫ్యాన్లు, కూలర్, చైర్, ఫ్రిడ్జ్, స్టాండ్, వాటర్ ట్యాంకులకు వేలం వేయనున్నట్లు తెలిపారు.

గడ్డివామి దగ్ధం



పాలెం వద్ద కాలిపోయిన గడ్డివామి

శెట్టూరు : మండలంలోని ములలేదు గ్రామ పంచాయతీలోని రంగయ్య పాలెం వద్ద గ్రామ రైతు బోయ బడిగే కిష్టప్పకు చెందిన గడ్డివామికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో గడ్డివామి, 8 బండ్ల వేరుశనగ పొట్టు, రెండు బండ్ల రాగి గడ్డి కాలి బూడిదైంది. సుమారు రూ.3 లక్షలు గ్రాసం కాలిపోయినట్లు బాధిత రైతు తెలిపాడు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు



తీవ్రంగా గాయపడిన సింగంపల్లి నాగన్న

కూడేరు: స్థానిక బస్టాండ్ సమీపంలో అనంతపురం -బళ్లారి ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనింది. ఈ ప్రమాదంలో ఆత్మకూరు మండలం సింగంపల్లికి చెందిన నాగన్న తీవ్రంగా గాయపడ్డాడు. అతని మనవడు మైఖేల్ స్వల్పంగా గాయపడ్డాడు. మైఖేల్, నాగన్న కూడేరులో వివాహ వేడుకకు వెళ్లి తిరిగి సొంతూరుకు వెళ్తూ రోడ్డు క్రాస్ చేస్తుండగా కారు అదుపు తప్పి ఢీకొనింది. ద్విచక్ర వాహనం నుంచి వారు కిందపడడంతో గాయాల పాలయ్యారు. క్షతగాత్రుడిని అదే కారులోనే అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

చిరుత దాడిలో దూడ మృతి



చిరుత దాడిలో మృతి చెందిన ఆవుదూడ

శెట్టూరు : మండలంలోని కై రేవు గ్రామంలో పశువుల మందపై చిరుత దాడి చేసింది. గ్రామంలో గాజుల ఎర్రిస్వామి తన తోటలో రాత్రి పశువులను కట్టి ఉంచాడు. ఆవుదూడపై చిరుత దాడి చేసింది. దాడిలో రెండేళ్ల వయసున్న ఆవుదూడ మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపాడు. ఫారెస్టు అధికారులు వాణి, పశువైద్యాధికారి ఎన్‌టీ చౌదరి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.


ఈ-ఆటోలు.. మూలకేనా?



నిరుపయోగంగా మారిన ఈ-ఆటోలు

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘం పరిధిలో పర్యావరణ పరిరక్షణ, తడి, పొడి చెత్త నిర్వహణకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటింటా చెత్త సేకరణకు ఈ-ఆటోలను కొనుగోలు చేశారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్-మున్సిపాలిటీలు సంయుక్తంగా రూ.లక్షలు వెచ్చించి తొమ్మిది ఈ-ఆటోలను కొనుగోలు చేశారు. అయితే చిన్నపాటి మరమ్మతులు, సెన్సార్ ఏర్పాటులో జాప్యంతో 7 ఆటోలు మూలనపడ్డాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, మరోవైపు అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో యంత్రాలు తుప్పు పడుతుండడంతో రూ.లక్షల ప్రజాధనం దుర్వినియోగం కానుంది.

చౌకబారు దందా..



'గతేడాది అక్టోబర్ 8న ఉరవకొండ శివారులోని రాములమ్మ ఆలయం వద్ద ఐచర్ వాహనం, ఆటోల్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకొని ఉరవకొండ స్టేషన్‌కు తరలించారు. మొత్తం 68 క్వింటాళ్ల బియ్యం పట్టుపడగా, ఇందులో 30 క్వింటాళ్ల బియ్యాన్ని వ్యాపారులతో పోలీసులు కుమ్మక్కై, కేవలం 38 క్వింటాళ్లు మాత్రమే చూపించారు. ఈవ్యవహారంలో ఏకంగా సీఐ, డీటీ సంతకాలు కూడా ఫోర్జరీ చేశారు. ఈఘటనపై జిల్లా ఎస్పీ విచారణ జరిపి ఓ కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపారు.'

తాజాగా ఈనెల 6న బళ్లారి బైపాస్‌లో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని ఉరవకొండ పోలీస్ స్టేషన్‌లో పని చేసే హెడ్‌కానిస్టేబుల్ మరో కానిస్టేబుల్ సహాయంతో పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. కొద్ది సేపటికే ఉరవకొండకు చెందిన అక్రమ బియ్యం వ్యాపారి పోలీసులపై చిందులు తొక్కుతూ నెల నెలా స్టేషన్‌కు మామూళ్లు ఇచ్చినా నా బియ్యం లోడునే పట్టుకుంటారా? అంటూ అర్బన్ స్టేషన్‌కు చెందిన పోలీసులను నిలదీశాడు. మారుమాట మాట్లాడకుండా పట్టుకున్న బియ్యాన్ని వదిలేశారు. ఈ ఘటన జిల్లాలో తీవ్ర చర్చనీయంశంగా మారింది.

ఈ ఘటనలే చాలు.. అక్రమ బియ్యం సరఫరాలో పోలీసుల పాత్ర ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా ఉరవకొండ కేంద్రంగా జోరుగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రేషన్ దందా జోరుగా సాగుతోంది. నియోజకవర్గంలో కూటమి నేతల ఆశీస్సులతో దాదాపు 32 మంది అక్రమంగా బియ్యం వ్యాపారం చేస్తున్నారు. ఈ వ్యాపారులంతా పోలీసులు, రెవెన్యూ అధికారులకు అందుబాటులో ఉంటూ వారికి నెలవారీ మామూళ్లు ముట్టచెబుతున్నట్లు సమాచారం.

- ఉరవకొండ కేంద్రంగా యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమరవాణా
- అక్రమ రవాణాకు పుష్కలంగా అధికారుల అండదండలు
- పోలీసులతో బియ్యం వ్యాపారుల సిండికేట్
- వ్యాపారులకు అధికార పార్టీ నేతల ఆశీస్సులు

ఉరవకొండ: గ్రామాల్లో రైస్ కార్డుదారులకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని కొందరు స్వార్థపరులు పక్కదారి పట్టిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేదల ఇంటి వద్దకే బియ్యం సరఫరా చేసేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గంటల తరబడి రేషన్‌షాపుల వద్ద క్యూలైన్లో నిల్చునే దుస్థితి నెలకొంది. దీన్ని ఆసరాగా చేసుకొని డీలర్లు కూడా వ్యాపారులతో కుమ్మక్కై కేవలం 1వతేదీ నుంచి 4వ తేదీ వరకు మాత్రమే బియ్యం పంపిణీ చేసి, స్టాక్ అయిపోందంటూ చెప్పి, మిగితా బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. అక్రమార్కులకు ప్రజల నుంచి కిలో బియ్యాన్ని రూ.15 నుంచి రూ.18తో కొనుగోలు చేసి, ఉరవకొండ నుంచి కర్ణాటకలోని పావగడకు తరలిస్తారు. అక్కడ రూ.30 నుంచి రూ.40 వరకు కేజీ బియ్యాన్ని విక్రయిస్తారు. ప్రతి 15 రోజులకు ఒకసారి 30 నుంచి 40 లోడ్ల బియ్యాన్ని కర్ణాటకు తరలిస్తారు. గతంలో రాత్రి సమయాల్లో గుట్టుచప్పుడు కాకుండా బియ్యాన్ని తరలించే వ్యాపారులు.. పోలీసులకు మామూళ్లు ఇస్తున్నాం కదా మమ్మల్ని అడ్డుకునేదెవరు అని పట్టపగలే బియ్యాన్ని తరలిస్తున్నారు.

అధికార పార్టీ నేతల ఆశీస్సులతోనే రవాణా:

ఉరవకొండ పట్టణంలోనే ఐదారుగురు బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారు. వీరు పోలీసులతో సిండికేట్ అయ్యి ప్రతి నెలా స్టేషన్‌కు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్ష చెల్లించేలా ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. వజ్రకరూరు, కూడేరు, బెళుగుప్ప, విడపనకల్లు మండలాల్లో అధికార పార్టీ నాయకులే నేరుగా బియ్యం అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం.

అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతాం

ఉరవకొండలో బియ్యం అక్రమ రవాణా చేసే అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతాం. ప్రతి రోజూ జాతీయ రహదారిపై నిఘా ఉంచి రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోకుండా అడ్డుకుంటాం. బియ్యం వ్యాపారులతో పోలీసుల పాత్రపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతాం.

– శ్రీనివాస్, డీఎస్పీ, గుంతకల్లు







ఉరవకొండ పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ వద్ద ఓ ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యం , బియ్యం సంచులు తూకం వేసి తరలించేందుకు సిద్ధం చేస్తున్న కూలీలు , పావగడకు రేషన్ బియ్యం పంపేందుకు లోడు చేస్తున్న కూలీలు

అధినేతను కలిసిన ఉరవకొండ నేతలు



అధినేత వైఎస్ జగన్‌తో మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి శుక్రవారం కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని సమస్యలను అధినేత జగన్ దృష్టికి విశ్వేశ్వరరెడ్డి, నాయకులు తీసుకెళ్లారు. భవిష్యత్తులో నియోజకవర్గంలో చేపట్టబోవు కార్యక్రమాలను అధినేతకు తెలియజేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బెస్త రమణ, పార్టీ అధికార ప్రతినిధి సీపీ వీరన్న, మఠం వీరేష్ తదితరులు ఉన్నారు.

జాతీయ భద్రత వారోత్సవాలు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ భద్రత వారోత్సవాలు నిర్వహించారు. పాఠశాలలో జాతీయ భద్రత వారోత్సవాల అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభను చూపిన విద్యార్థినీవిద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇమాంసాబ్, రామ్మూర్తి, గోవిందరెడ్డి, ఉమాశంకర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని తిమ్మంపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. 108 సిబ్బంది తెలిపిన మేరకు.. పెద్దవడుగూరు మండలం దిమ్మగుడికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, మరో వ్యక్తి ద్విచక్ర వాహనంపై అనంతపురం నుంచి పామిడి వైపు వెళ్తుండగా, తీరా ఘటనా స్థలం వద్దకు రాగానే ప్రమాదవశాత్తూ ద్విచక్రవాహనం ఆటోను ఢీకొనింది. దీంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, మరో వ్యక్తి గాయపడ్డారు. వెంటనే స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

గజలక్ష్మి ఆలయంలో విశేష పూజలు



ప్రత్యేక పూజలందుకున్న గజలక్ష్మిదేవి

రాయదుర్గంటౌన్: మల్లాపురం ఇందిరమ్మ కాలనీలో వెలసిన గజలక్ష్మి దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు చేసి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు గావించారు. దుగ్గిలమ్మ ఆలయం, దండుమారెమ్మ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వానపాములతో ఆదాయం

బొమ్మనహాళ్: వానపాములతో ఆదాయం సమకూరుతుందని ఈఓపీఆర్‌డీ దాస్ తెలిపారు.
శుక్రవారం మండలంలోని ఉంతకల్లు, గోవిందవాడ, కల్లుదేవనహళ్లి, శ్రీధరఘట్ట తదితర గ్రామాల్లో నిర్మించిన వర్మీకంపోస్టు సంపద తయారీ కేంద్రాల్లో వానపాములు వదిలారు. బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం నుంచి వానపాములను తెప్పించిన్నట్లు తెలిపారు. రైతులు సాగు చేసే పంటలకు ఉపయోగపడే విధంగా తయారుచేసి గ్రామ పంచాయతీ ఆదాయం సమకూర్చే విధంగా వానపాములతో ఎరువు తయారు చేస్తున్నట్లు ఈఓపీఆర్డీ తెలిపారు. గ్రామ పంచాయతీల్లో ఒకవైపు కొండలా పేరుకుపోతున్న చెత్త తగ్గించడం, మరోవైపు నాన్యమైన సేంద్రియ ఎరువు తయారు చేయడం, వాటి అమ్మకాల ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఈఓపీఆర్‌డీ దాస్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ముక్కన్న, పంచాయతీ కార్యదర్శులు శివన్న, రాధాకృష్ణ పాల్గొన్నారు.



వానపాములను వదులుతున్న అధికారులు

వరుస చోరీలతో బెంబేలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఇటీవల రెండు దుకాణాల్లో సరుకులు, క్యాష్ కౌంటర్‌లోని డబ్బు ఎత్తుకెళ్లారు. 74 ఉడేగోళంలోని జూనియర్ కళాశాల ఎదురుగా ఓ కిరాణా షాపులోనూ రేకులు ఎత్తుకెళ్లారు. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పట్టణంలోని బీజీ తిలక్ మున్సిపల్ హైస్కూల్ ఎదురుగా ఉన్న వెంకటేశ్‌కు చెందిన టీ కేఫ్‌లోకి ప్రవేశించి రూ.5 వేల నగదు, సిగరేట్ ప్యాకెట్లు, ఇతర వస్తువులు ఎత్తుకెళ్లారు.

నేడు మండల సర్వ సభ్య సమావేశం

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుళ్లాయిస్వామి శుక్రవారం తెలిపారు. సమావేశానికి సర్పంచులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యులు , అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

నులి పురుగుల నివారణ పోస్టర్లు విడుదల



జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

ఉరవకొండ : ఈనెల 10న జరగబోవు జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ పోస్టర్లను అధికారులు శుక్రవారం విడుదల చేశారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ కార్యాలయంలో ఈఓఆర్‌డీ సతీష్‌కుమార్, వైద్యాధికారిణి వినీతతో పాటు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది విడుదల చేశారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ ఈనెల 10న ప్రభుత్వ పాఠశాలలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 18 ఏళ్ల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. మిగిలిన వారికి ఈనెల 17న మాప్‌అప్ రౌండ్ వేస్తారన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

ఉరవకొండ: ఈనెల 10 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ ప్రాక్టికల్స్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బాలుర, బాలికల జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ మమత శుక్రవారం తెలిపారు. స్థానిక ఇంటర్ బాలికల కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 10 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ ప్రాక్టికల్స్ ఉదయం 9 గంటలు, తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు రెండు బ్యాచ్‌లుగా జరుగుతాయన్నారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల, మహాత్మా జూనియర్ కళాశాల, ప్రభుత్వ మోడల్ స్కూల్స్, కేజీబీవీ విద్యార్థులకు ఉరవకొండ జూనియర్ కళాశాలలోనే పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం వృత్తి విద్యా విద్యార్థులు 161 మంది, రెండో సంవత్సరం వృత్తి విద్యా విద్యార్థులు 102 మందితో పాటు జనరల్ విద్యార్థులు మొత్తం 220 మంది ప్రాక్టికల్స్‌కు హాజరు కానున్నట్లు తెలిపారు.



ఉరవకొండ జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్స్‌కు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

ఎనీటైం మనీ..భద్రతలేదేమీ!



సెక్యూరిటీ గార్డు లేని ఎస్‌బీఐ ఏటీఎం



ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సెక్యూరిటీ గార్డు లేని ఇండియా నంబర్ 1 ఏటీఎం

కళ్యాణదుర్గం: పట్టణంలో పలు బ్యాంకుల ఏటీఎంల వద్ద భద్రత కొరవడింది. 24 గంటలూ సెక్యూరిటీని ఉంచాల్సి ఉంది.అయితే బ్యాంకర్లు భద్రతను పట్టించుకోలేదు. పట్టణంలో ఎస్‌బీఐ, యూనియన్, సిండికేట్ బ్యాంకు, ఏపీజీబీ, కర్ణాటక బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఇండియా నంబర్ 1 బ్యాంకులకు సంబంధించి దాదాపు 18 వరకు ఏటీఎంలు ఉన్నాయి. ఆయా ఏటీఎంలను నిత్యం పర్యవేక్షిస్తూ భద్రత కల్పించాల్సిన బ్యాంకర్లు పట్టించుకోవడంలేదు. ఏటీఎంల వద్ద డోర్లకు బిగించిన అద్దాలు కూడా గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఏటీఎంల వద్ద సెక్యూరిటీ లేకపోవడంతో దుండగలు ఏటీఎం మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల పట్టణంలో ఏటీఎంలను ఏమార్చి అమాయకులను మోసం చేసిన ఘటనలూ ఉన్నాయి. ఏటీఎంలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా, అవి బయటి వైపు నుంచి వచ్చే వారు కనబడేలా లేకపోవడంతో దుండగుల మోసాలకు మార్గం ఏర్పడింది.



ముదిగల్లు రోడ్డులో ధ్వంసమైన ఎస్‌బీఐ ఏటీఎం డోర్



జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ ఏటీఎంలో పగిలిన డోర్ అద్దాలు

వైభవంగా వాసవీమాత విగ్రహ ప్రతిష్ట

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం వైభవంగా ముగిసింది. మూడు రోజుల పాటు విశేషంగా పూజలు జరిగాయి. శుక్రవారం తెల్లవారుజామున 5:30 గంటలకు వాసవీ కన్యకాపరమేశ్వరి, శ్రీగణపతి , సుబ్రహ్మణ్యేశ్వర, నాగేశ్వర విగ్రహాల ప్రాణ ప్రతిష్టాపన చేయించారు. ప్రాణ ప్రతిష్టానంతరం ఉదయం మూలమంత్ర హోమం, తత్వాన్యాస, కళాన్యస, చండీ హోమం నిర్వహించి పూర్ణాహుతి జరిపించారు. మధ్యాహ్నం కుంభాభిషేకం జరిపించారు. విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా ఆర్యవైశ్యులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సన్నిధిలో భక్తులకు అన్నాదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ముద్దు మల్లికార్జున శెట్టి, ఆర్వేటి లేపాక్షి శెట్టి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠించిన వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

అక్రమంగా నిర్మిస్తున్న చెక్‌డ్యాంను తొలగించండి

కూడేరు: వాటర్ షెడ్ చైర్మన్, టీడీపీ కార్యకర్త ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తన పొలం (సర్వే నంబర్ 296-8)లో దౌర్జన్యంగా చెక్ డ్యాం నిర్మించారని ముద్దలాపురానికి చెందిన రైతు దొంబర చంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వాటర్ షెడ్ స్కీం కింద చెక్ డ్యాం నిర్మిస్తున్నట్లు తెలియడంతో పొలంలోకి వెళ్లి చూశానన్నారు. అనుమతి లేకుండా చెక్ డ్యాం ఎలా నిర్మిస్తారని వాటర్ షెడ్ పీఓ ఈశ్వరయ్యకు ఫోన్‌లో అడిగితే వాటర్ షెడ్ కమిటీ చైర్మన్, సభ్యులు చెప్పడంతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. వాటర్ షెడ్ చైర్మన్‌ను అడిగితే ఈ భూమి నీది కాదు.. వేరేవాళ్లది, చెక్ డ్యాం నిర్మిస్తాం.. ఎవరికైనా చెప్పుకో అని దౌర్జన్యంగా మాట్లాడుతున్నాడని బాధితుడు వాపోయాడు.

సబ్సిడీ రుణాల దరఖాస్తు గడువు పెంపు

కూడేరు: 2024-25 ఆర్థిక సంవత్సరంలో బీసీ కార్పొరేషన్ రుణాలు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 12 వరకు గడువు పొడిగించినట్లు ఎంపీడీఓ కుళ్లాయిస్వామి శుక్రవారం తెలిపారు. బీసీలకు మొత్తం 29 యూనిట్లు, ఈబీసీ కులాల వారికి మొత్తం 4 యూనిట్లు, కాపు(బలిజ) కులానికి చెందిన వారికి 9 యూనిట్లు ఉన్నాయని ఆయన తెలిపారు.